# వేపచెట్టు



మైసయ్యకు వెంకట్రావు చిన్నకొడుకు రాజేశ్వర్రావు తన పేరు యాదికుంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. అయితే దాంతో పాటు పాత జీవితం, వెనకటి సంగతులు గుర్తొచ్చి మనస్సులో పాతగాయం చేసింది.

కలిసి వద్దామని వేపచెట్టు నీడలో ఉన్న మంచంలో రెండుసార్లులేసి మళ్ళీ ఆగిపోయాడు. మైసయ్య. ఏందట పోయి కల్సేది? నేనంత పెరిగిన్నో అని పటాటోపం చూపుటానికే అందర్నీ యాదిచేసిండేమో! అని ఓ పక్క అసహనం, కోపం, బాధ! చూస్తుండగానే వ్యవసాయదారుడు, వ్యవసాయం విడిచిపెట్టి పట్నంబోయి చదివి, పట్నంలో పెరిగి పెరిగి పెరగడానికి పట్నం చాలక అమెరికా పోయి కోట్లకు ఎదిగాడు రాజేశ్వర్రావు. తన సన్నకారు వ్యవసాయం వదలనూలేక ఎదగనూలేక ఎన్నేళ్ళయినా గొర్రెతోక బెత్తెడే అన్నట్టుగా కురచబారిపోయింది.

మరో పక్క కలిసివస్తే ఏంబోయింది అని మనస్సు కొట్టుకుంది. రాజేశ్వర్రావు ఇరవై ఏండ్లకు సొంత ఊరు వచ్చాడు. మల్లా ఎన్ని ఏండ్లకో, మధ్యలో రెండేళ్ళకోసారి యిండియా కొచ్చినా పల్లెదాకా వచ్చీరాకుండానే వెళ్ళిపోయాడు. పాపం! రాజేశ్వర్రావుకు యిన్నేండ్లల్ల పాతయన్ని జ్ఞాపకం పెట్టుకునే తీరికుంటుందా! తన పిచ్చిగాని! అనుకుని చివరకు బయలుదేరాడు మైసయ్య.

రాజేశ్వర్రావు అమెరికా నుంచి వచ్చి ఇరవై రోజులైపోయింది. సొంత ఊర్లో అందర్నీ కల్సిపోదామని జగిత్యాలవచ్చి రెండు రోజులైంది. క్రితం రోజు జగిత్యాల నుంచి పగటిపూట తన పల్లెటూరు వెళ్ళివచ్చాడు. అందరినీ పేరు పేరునా పలకరించాడు. ఇరవై ఏళ్ళనాటి ప్రయిమరీ స్కూలు మూడేళ్ళ క్రితం హైస్కూలవడం చూసి సంతోషించాడు. స్వయంగా వెళ్ళి ఉపాధ్యాయుల్ని, విద్యార్థుల్ని పలకరించాడు.

రాజేశ్వర్రావు పట్ల ఆ స్కూలు ఉపాధ్యాయులకూ, విద్యార్థులకు మూడేళ్ళ క్రితం కొత్త అనుబంధం ఏర్పడ్డది. హైస్కూలు కావడం కోసం కట్టాల్సిన విరాళం రాజేశ్వర్రావే యివ్వడంతోపాటు ఆ స్కూల్లో చదివి అత్యధిక మార్కులు తెచ్చుకున్న ఎసెస్సీ విద్యార్థులు ముగ్గురికి తన పేరిట ప్రోత్సాహక ప్రతిభా పురస్కారాలిస్తూ వస్తున్నాడు. అలా పురస్కారాలందుకున్న విద్యార్థులిపుడేం చేస్తున్నారని, వారి తల్లిదండ్రులెవరని కుశలమడిగి తెల్సుకున్నాడు. అట్లా మహేష్ తండ్రిగా మైసయ్యను గుర్తుకు తెచ్చుకుని మరీమరీ గుర్తు చేశాడు రాజేశ్వర్రావు. స్కూలు కోసం అక్కడికక్కడే కొంత విరాళం ప్రకటించాడు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో విరాళంగా ఫ్యాన్లు పెట్టిస్తానన్నాడు. అలా అడగ్గానే అంగీకరించినందుకు ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులుకూ, హాస్టల్‌వార్డెన్ సుగుణాకర్‌కూ రాజేశ్వర్రావు సహృదయతపై మరింత అభిమానం పెరిగిపోయింది. వాళ్ళే యింటికొచ్చి మరీమరీ గుర్తు చేశాడని చెప్పడంవల్ల మైసయ్యకు ఉత్సాహం కలిగింది. తన కొడుకు స్కూలుకు ఫస్టు వచ్చిండన్న విషయం కూడా రాజేశ్వర్రావుకు తెల్సింది అని తనలో తాను కాస్త గర్వంగా కూడా ఫీలయ్యాడు మైసయ్య.

దారి పొడుగునా, బస్సులోనూ మైసయ్యలో రాజేశ్వర్రావు గురించిన జ్ఞాపకాల

తాలూకు ఆలోచనలే. పాత విషయాలను కొత్త అవగాహనతో రాజేశ్వర్రావు కొత్త వ్యక్తిత్వానికనువుగా పునర్నిర్మాణం చేసుకొంటున్నాడు మైసయ్య. వెనుకటి తన ఆలోచనలు, ఆనాటి సంగతులు అన్నీ ఏదో పొరపాటు వల్ల అపశృతులు దొర్లాయి తప్పితే మనిషి చాలా మంచివాడే అనుకుంటూ గతంలోని చెడును వదిలి అతని మంచినంతా గుర్తు చేసుకుంటున్నాడు మైసయ్య. చేసిన తప్పుల్ని ఇలా మంచి పనుల్తో సరిదిద్దుకుంటే గతం గుర్తు చేసి తప్పులెందుకు ఎంచుతారులే !. అంతా మంచినే గుర్తుంచుకోరూ! అని ఆశాభావంతో ఆలోచిస్తున్నాడు మైసయ్య.

○ ○ ○ ○ ○

చిన్నప్పుడు తమ ఇంట్లో అన్ని పనులు చేసిన మైసయ్యంటే రాజేశ్వర్రావుకు యిప్పటికీ ఎంతో దయ. అతని కోసం ప్రత్యేకంగా ఒక ధోతుల జోడా, అంగిబట్ట హైద్రాబాద్‌లో కొనుక్కొచ్చాడు రాజేశ్వర్రావు.

మైసయ్యను అంత దూరం నుంచే చూసి అవాక్కయిపోయాడు రాజేశ్వర్రావు. తన కన్నా మూడేళ్లు చిన్నవాడైన మైసయ్య ఇపుడు తన కన్నా యిరవైఏళ్లు పెద్దవాడిలా శరీరం నల్లబడి ముడతలు తేలింది. క్షణాల్లో జ్ఞాపకాల్నించి తేరుకొని కొన్ని అడుగులు ఎదురువెళ్లి నవ్వుతూ చేతిలో చేయి కలిపాడు. బిగ్గరగా కౌగలించుకున్నాడు. మైసయ్య ఊహించని పరిణామం. అతని మనస్సూ, శరీరం ఆనందానుభూతుల్తో అణువణువూ పులకరించిపోయింది. చుట్టూ చూస్తున్న వాళ్లలోనూ ఆనందాశ్రువులు.

రాజేశ్వర్రావు అమెరికాలో ఇపుడు పెద్ద డాక్టరు. చిన్నప్పుడు ఊళ్లో అతన్ని చిన్నదొర అని పిలిచేవాళ్లు. ఇపుడు దొర అని పిలిపించుకోవడం అసలే ఇష్టం లేదు. అందరూ డాక్టర్ సాబ్ అని పిలుస్తుంటే మైసయ్యకు కొత్తగా అన్పించింది. అంతలో ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు సారూ, వార్డెను సుగుణాకరు సారూ అక్కడికొచ్చారు. నిన్న ఇచ్చిన హామీ ప్రకారం వాళ్లకు చెక్కులు రాసి చేతిలో పెట్టాడు రాజేశ్వర్రావు. వాళ్లనలా కాసేపు కూర్చోమని మైసయ్యతో అదీయిదీ మాట్లాడుతున్నాడు రాజేశ్వర్రావు. ఊకొడ్తున్నాడు మైసయ్య.

'ఏదో ఒకటి వరం అడుగు, ఏదో ఒకటి మాట్లాడమన్నట్టు' ఆంజనేయులూ, సుగుణాకరూ మైసయ్యకేసి చూశారు. మైసయ్యక్కూడా మనస్సులో అదే వుంది. కాస్త ఆగి అడుగుదామనుకుంటున్నాడు.

మైసయ్య పెద్ద కొడుకు పదోది ఫేలై వ్యవసాయం పని చూసుకుంటున్నాడు. చిన్నోడు ఇంటర్‌మీడియట్ పాసైనాడు. కూతురు పెండ్లి చేశాడు. అల్లుడు సౌది అరేబియా వెళ్లాడు.

"అయ్యా!" అని తత్తరపడి గొంతు సవరించుకొని అన్నాడు మైసయ్య. "డాక్టరు సాబు! పెద్దోడు పది ఫేలయిండు. చిన్నోడు ఇంటర్‌పాసై ఉత్తగనే ఉన్నడు"

"ఇంటర్ పాసై ఉత్తగ ఎందుకున్నాడు? చదివించవచ్చు గదా. ఎన్నో

హాస్టలున్నాయి. స్కాలర్‌షిప్‌లిస్తారు" అని అన్నీ వివరంగా చెప్పాడు రాజేశ్వర్రావు.

"నేను ఎవుసం జేస్తే వాడు యింజనీరు అయితడా అని పెద్దోడు కోపం మీద ఉన్నడు" ఈ మాట ఎట్లా చెప్పాలి అని వెనుకాముందయ్యాడు మైసయ్య. సుగుణాకర్ వార్డెన్ ఆ మాట అననే అన్నాడు. రాజేశ్వర్రావు అన్నదమ్ముల మధ్య యింత కుత్సితపు ఆలోచనలుంటాయని విని ఆశ్చర్యపోయి అన్నాడు.

"తమ్ముడు చదువుకుంటే అన్నక్కూడా ఎంత పేరు, ఎంతో కొంత సాయం అందదా!" చిన్నోడు యింజనీరైతే వ్యవసాయం అంతా పెద్దోనికే యిచ్చేయవచ్చు అనే ధ్వని ఆ మాటల్లో ఉన్నట్టనిపించి ఆంజనేయులు, సుగుణాకర్‌లు సంతోషపడ్డారు. మహేష్ వాళ్ల ప్రియశిష్యుడాయె మరి.

"లాంగ్ టర్మ్ కోచింగ్‌కు పంపిస్తే మహేష్‌కు యింజనీరింగ్ సీటు తప్పకుండా వస్తుంది సార్ ! విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరుల్లో మంచి కోచింగ్ సెంటర్లున్నాయి. పంపించమంటే పంపడం లేదు డాక్టర్ సాబ్" అన్నాడు ఆంజనేయులు.

"గవన్ని నాతో ఏడ అయితయి డాక్టర్ సాబ్" అని తల అడ్డంగా ఊపాడు మైసయ్య. ఉన్న పొలం కుదువ బెడ్తే పొలం పోయి, అటు సీటురాక చదువుపోతే ఎటూ కాకుండా అవుతుందని ఆలోచన.

ఒక జీనియస్ విద్యార్థి ఈ పోటీ ప్రపంచంలో డబ్బుల్తో పోటీ పడలేక జీవితంలోని ఎదుగుదలే ఆగిపోవడం రాజేశ్వర్రావు హృదయాన్ని కలచివేసింది. మహా అయితే ముప్పయివేల రూపాయలు కోచింగ్‌కు ఖర్చవుతాయి. తనకు డాలర్లలో అది కేవలం ఎనిమిది వందలు. ఎన్ని ఖర్చవడం లేదు. ఎనిమిది వందల్తో ఒక జీవితమే వేల ఏళ్ల వెనుకబాటుతనం నుంచి అత్యున్నత శిఖరాలకు ఎదుగుతుంది. ఏమైనా ఆ సాయం చేసేందుకు దొరికిన ఈ అవకాశం వదులుకోకూడదు. వారి ఆత్మగౌరవంపై సాయం తాలూకు న్యూనత ఫీలింగ్ రాకూడదనుకొని అన్నాడు రాజేశ్వర్రావు.

"మైసయ్యా! నువ్వేమి బెంగపెట్టుకోకు. అవన్నీ నేను చూసుకుంట. మీవాడు తప్పక యింజనీర్ అవుతాడు. యింజనీర్ అయ్యాక నేనే అమెరికాకు వచ్చే ఏర్పాటు చేస్తాను. అప్పుడు సంపాదించినాక నేను పెట్టింది తీసుకుంటాను. అది కూడా మళ్లీ మన ఊరి అభివృద్ధికే యిచ్చేస్తాను మీ ఆడి పేరిట" అని ఖర్చుల వివరాలన్నీ ఆంజనేయులుతో చర్చించాడు రాజేశ్వర్రావు. చివరగా మళ్లీ అన్నాడు.

"డబ్బులైతే నేనివ్వగలను గానీ, నిరంతరం ప్రోత్సహించి మహేష్‌ను యింజనీర్ చేసే బాధ్యత మీదే" అన్నాడు రాజేశ్వర్రావు.

రాజేశ్వర్రావు హైస్కూలు నుంచి క్లాసుమేట్సు అయిన ఆంజనేయులు, సుగుణాకర్‌లు 'తప్పకుండా' అంటూ సంతోషంగా తలలూపారు. మైసయ్య హృదయం ఆనందంతో ఉప్పొంగింది.



రాజేశ్వర్రావు పెట్టిన బట్టలు తీసుకొని యింటికి నడుస్తుంటే మైసయ్యకు ఇంజనీరైన కొడుకును ఇంటికి తీసుకుపోతున్నట్టుగా ఆనందంగా ఉంది.

బస్సులో వచ్చిన పగటి కల నిజమై యిలా జరిగితే ఎంత బావుండు అనుకున్నాడు మైసయ్య. కాని మైసయ్య వెళ్లేసరికి రాజేశ్వర్రావు యింట్లో లేడు. ఏ రాత్రికొస్తాడో తెలియదన్నారు.

మరుసటి రోజు వెళ్లేసరికి హైద్రాబాద్ వెళ్లిపోయాడు రాజేశ్వర్రావు.

మైసయ్య ఆశ నిరాశగా మారి డీలా పడిపోయాడు.

అంజనేయులు, సుగుణాకర్ సార్లు తమ పిల్లల్ని గుంటూరుకు లాంగ్ టర్మ్ కోచింగ్‌కు తీసుకకానిపోయి చేర్చి వచ్చాక మైసయ్య మనస్సు మనస్సులో లేదు. తన కొడుక్కూడ ఇంజనీరైతే ఎంత బాగుండేది! కానీ అన్ని పైసలు ఎక్కన్నించి వస్తాయి? అని నిరాశగా వేపచెట్టు కింద నులక మంచంలో ఒరిగి కళ్లు మూసుకొని రంధి పడ్తుండడం మైసయ్యకు నిత్యకృత్యమైపోయింది.

అంజనేయులు, సుగుణాకర్‌లు గుంటూర్లో లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇచ్చే కాలేజీని, హాస్టల్‌ను అందులోని క్రమశిక్షణను చూసి మొదట తబ్బిబ్బయిపోయారు. లోలోపల భలే సంతోషించారు. కానీ ఖర్చే తడిసి మోపెడు అవుతోందని లోలోన బాధ. అప్పు చేసైనా ఒక్క సంవత్సరం కష్టపడక తప్పదనుకున్నారు. కానీ వాళ్ల పిల్లలు పది రోజుల్లోనే చెప్పకుండా పారిపోయి ఇంటికి చేరారు. సీటు రాకపోయినా సరే ఇక్కడే చదువుకుంటాం. చచ్చినా పోం ! అని ఏడ్చారు. మళ్లీ పంపిస్తే మా శవాలే చూస్తారని అన్నారు.

ఆంజనేయులు, సుగుణాకర్‌ల గుండెలు దడదడమన్నాయి. అంత దాకా కోచింగ్ సెంటర్లపై వున్న ప్రేమ ఒక్కసారిగా ద్వేషంగా మారింది. ఈ ప్రయివేటు కాలేజీలవాళ్ళు, కోచింగ్ సెంటర్లవాళ్లు... దొంగలం... కొడుకులు. ఇరవైవేల రూపాయలు అడ్వాన్సు గుంజారు. ఒక్కపైసా వాపసు ఇవ్వరు. పోయినేడు ఫలానా ఆయన కొడుకులాగే చేస్తే ఒక్క పైసా వాసు ఇవ్వలేదు. అని పేరుపేరునా కాలేజీల్ని గుర్తుచేసికొని బండబూతులు తిట్టారు. పిల్లల్ని కొట్టి, తిట్టి, ఏడ్చి ఎలాగోలా నాలుగు రోజుల్లో మళ్లీ తీసుకొని చేర్చి వచ్చారు.

ఎంసెట్ రిజల్టుతో మహేష్ ఆశ పూర్తిగా హరించింది. ఇష్టం లేని చదువు డిగ్రీ ఫస్టియర్లో ఫేలయ్యాడు. ఆంజనేయులు, సుగుణాకర్‌లు ఏ కాలేజీలో తమ పిల్లలకు యింజనీరింగ్ సీటు వస్తుందో లెక్కల్తో కుస్తీ పడుతున్నారు. తమ క్లాసుమేటు రాజేశ్వర్రావు ఇరవై ఏళ్ల కిందటే అమెరికా పోగలిగాడు. తమకు ఆ కాలంలో ఈ చదువు, ఈ ఉద్యోగాలు అందుకోవడమే గొప్పయిపోయింది. పైసలున్నోడు కావడంతో ట్యూషన్లు పోయి మార్కులు ఎక్కువ తెచ్చుకుని రాజేశ్వర్రావు డాక్టర్ కోర్సులో సీటు సంపాదించుకోగలిగాడు. ఇరవైఏళ్లు ఆలస్యంగా తమకు కాకపోయినా తమ పిల్లలు ఈ రోజు రాజేశ్వర్రావులా పైసల తోడ్పాటుతోనైనా అతని లాగా ఎదగగలిగే అవకాశం వచ్చింది. రాజేశ్వర్రావు తమ పిల్లలు అమెరికాలో సెటిలవడానికి తప్పక సాయం చేస్తాడు. చిన్న సీసాతోపాటు మటన్‌పూరీలు నములుతూ ఊహాలోకాల్లో విహరిస్తున్నారు ఆంజనేయులు, సుగుణాకర్‌లు. వారితోపాటు జూనియర్ లెక్చరర్ రాజయ్య కూడా ఉన్నాడు. ఆ సమయంలో మైసయ్య తూలుతూ అక్కడికి చేరాడు. ఎపుడూ వినయంగా ఉండే మైసయ్య మైకంలో నానా మాటలు అన్నాడు.

“మీరు మంచిగ సదువుచెప్తె నా కొడుక్కు గూడ ఇంజనీరింగ్ సీటు రాకపోవునా! మీరు చెప్పే సదువుల మీద మీకు నమ్మకముంటే మీ కొడుకులను నా కొడుకు తోటి యిదే బడిలో ఎందుకు సదివించలేదు. రాజేశ్వర్రావు దొర, మీరు చిన్నప్పటి క్లాసుమెంట్లు అని తెగ చెప్పుకుంటరు. అందరు ఒకటే బడిలో సదువుకుంటే నా కొడుకే ఫస్టువచ్చు. ఆ రోజులెటువోయినయి. ఇపుడు కనీసం మీ కొడుకులన్నా నా కొడుక్కుక్లాసుమేట్లు కాలేకపోయిన్రు. పేదోల్లందర్ని సర్కారు బడిలో, కాలేజీల్లో ఏరేసి ఉంచినట్లయింది. వేలకు వేలు సర్కారు జీతాల్తోటి దినుకుంట మీరు మాకేమో ఉత్త సదువులు జెప్తరు. మీరేమో మీ జీతాల్తోటి ప్రయివేటుగ సదివిస్తరు. నా కొడుకు వజ్రపు తునుక సారు”.

మైసయ్య మాటల్తో ఆంజనేయులు మనస్సు కలుక్కుమంది. మహేష్ స్కూలుకు ఫస్టు వచ్చాడు. తాను యింతకన్నా ఏం చేయగలడు. గవర్నమెంటు జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు మంచిగా నడిస్తే తాము కూడా యిక్కడే చదివించేవారు గదా! తమ బాధ ఎవరికి చెప్పుకోవడం! కృతజ్ఞత మరిచి మైసయ్య తిడుతుంటే వారికి కోపంగా ఉండీ మౌనం వహించారు. అరిచి అరిచి వెళ్లిపోయాడు మైసయ్య.

మూడ్ ఆఫై పోయి మరో సీసాకు మనిషిని పంపాడు ఆంజనేయులు. అయినా

మైసయ్య మాటలే గింగిర్లు తిరుగుతున్నాయి. మైసయ్య అన్నదాన్లో తప్పేముంది? రాజేశ్వర్రావు పల్లెటూరి స్కూల్లోనే చదివాడు. హైస్కూలు నుంచి క్లాసుమేటు కూడా. తాము సర్కారు బడిలోనే చదివి ఉద్యోగాలు సంపాదించారు. రాజేశ్వర్రావు అమెరికా వెళ్లాడు. ఇపుడెందుకిలా లేదు. సమాజం ఇలా ఎందుకు మారింది? తమకు మునుపటి కన్నా జీతాలు ఎన్నో రెట్లు పెరిగాయి కూడా. తాము చెప్పే స్కూళ్లపై తమకు నిజంగానే విశ్వాసం ఉంటే తమ పిల్లల్ని ప్రైవేటు స్కూల్లో ఎందుకు చేర్పించినట్టు? ప్రైవేటు స్కూల్లో ట్రైనింగ్ లేనివాళ్లు చెప్తే మంచిగా చదువు వచ్చేదైతే ఇన్ని టీచర్ ట్రైనింగ్‌లెందుకు? ప్రైవేటు హాస్టల్స్ లాగా ప్రభుత్వ హాస్టల్స్, స్కూల్స్ నడిపితే మహేష్ ఇంకా ఎక్కువ మార్కులు తెచ్చుకునేవాడు గదా!

"సుగుణాకర్ సారూ! నాదో డౌటు. ఈ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివిన వారికెవరికైనా ఈ పోటీలో ఎంసెట్ సీట్లు వస్తున్నయంటారా?" అంటూ అడిగాడు ఆంజనేయులు.

"మా వస్తున్నయి. అయితే అవి ఎస్సీ, ఎస్టీలకున్న రిజర్వేషన్ల వల్ల వస్తున్నయి. ఓపెన్ కాంపిటీషన్లో మాత్రం గవర్నమెంటు కాలేజీల్లో చదివిన వారికి అసలు వస్తున్నాయా? అని నాక్కూడా డౌట్. మైసయ్య అన్నదాన్ల తప్పేముంది? నిజాలు చేదుగానే ఉంటయి. అని వినాలె. వాటిని పట్టించుకుంటేనే అవి వేపచెట్టులాగ సమాజానికి మేలు చేస్తయి. మునుపు పేదోల్లు చదువుకుంటే చాలు. ఎదిగిన్రు. ఇపుడు ఉద్యోగాలెక్కడిస్తన్రు. ఏదైనా స్వయం ఉపాధి వెతుక్కుందామంటే లక్షల పెట్టుబడి కావాలె. మనలాగా కాస్త ముందుగా ఎదిగినవాళ్ల పిల్లలు పోటీలో ఎంతో కొంత దక్కించుకుంటున్నారు. ఇపుడు వెనకట మనలాగా పేదలుగా ఉన్నవాళ్ల పిల్లలు మనలాగా ఎదగడం కూడా కష్టమే."

"ఈ కొత్తరకం సామాజిక అభివృద్ధి తాలూకు ప్రధాన జీవన స్రవంతికి ముప్పయి కోట్ల జనం దీని వెలుపలే ఉండిపోతారట. అనగా గ్లోబలైజేషన్, లిబరైలేజషన్, ప్రైవేటైజేషన్ వల్ల చదువుకొన్న వాళ్లు కూడా అసంఘటిత రంగాల్లో, కనీస జీతాలు లేక కొత్త రకం వెట్టిచాకిరిలోకి నెట్టేయబడతారు. ఆలోచిస్తే మనలాంటి వాళ్ల పిల్లల భవిష్యత్తులు కూడా భయంకరమేనట" అని అన్నాడు. సుగుణాకర్.

ఔనంటూ జూనియర్ లెక్చరర్ రాజయ్య మరో లెక్చరిచ్చాడు.

"ఛ! మూడ్ పాడైపాయె. వేరే టాపిక్‌కు పోదాం" అన్నాడు ఆంజనేయులు.

"వేపచెట్టు వేల ఏళ్లుగా మన దేశపు చెట్టు. మనకు దాని విలువ తెలియకపాయె. ఇపుడు అమెరికావాళ్లు దాని మీద పేటెంటు హక్కు కోసం ట్రై చేస్తున్నారు. ఇపుడు మనవాళ్లు మాది అని గగ్గోలు పెడుతున్నారు. కలబందను మోటు వైద్యం అని మనవాళ్లు దేకనేలేదు. ఇపుడు దాని మందుల పేటెంట్లు అమెరికాలో రిజిష్టరైనయట" టాపిక్ మార్చి అన్నాడు సుగుణాకర్.

డోసు పెరిగిన కొద్దీ మైసయ్య అన్న మాటల్తో ఆంజనేయులుకు దుఃఖం వస్తోంది. "వాడు – మహేష్ – నా ప్రియశిష్యుడు. వాన్ని నేను సొంత కొడుకులాగా చూసుకున్నాను. నన్ను మైసయ్య ఎన్ని అన్నాడు. మహేష్ కూడా ఒక వేపచెట్టు – ఒక కలబంద మొక్క అతని శక్తిసామర్థ్యాలు మనం గుర్తించడం లేదు. గ్లోబలైజేషన్‌లో భాగంగా లేదా ప్రైవేటైజేషన్‌లో భాగంగా అతని మీద పేటెంటు హక్కులు తీసుకొని అవన్నీ వెలికి తీసి వినియోగంలోకి తెచ్చే మానవ వనరుల శాఖ ఉంటే ఎంతబాగుండు. అపుడు మహేష్ కూడా రాజేశ్వర్రావులాగే, మన పిల్లల్లాగే ఎదుగుతాడు" అన్నాడు ఆంజనేయులు.

ఔనంటూ ఊ కొట్టాడు సుగుణాకర్.

"ప్రభుత్వం మనందరికి జీతాలిస్తున్నది, కాలేజీలు, స్కూల్లు, హాస్టల్లు పెట్టింది అందుకోసమే గదా! తప్పు ఎవరి మీదికో నెట్టేస్తారెందుకు?" అన్నాడు లెక్చరర్ రాజయ్య.

అందరికీ తేలు కుట్టినట్టయి చర్చ అక్కడితో ఆగిపోయింది.

నేను డిగ్రీ చదవను అంటూ పారిపోయిన కొడుక్కోసం మైసయ్య వెతికి వెతికి వేసారిపోయాడు. ఏళ్లు గడిచిపోయాయి. నాలుగేళ్ల తర్వాత ఎక్కడో కన్పించాడంటే ముంబాయి వెళ్లాడు మైసయ్య. బిల్డింగ్ నిర్మాణంలో మేస్త్రి పని చేస్తున్నాడు మహేష్. అతడి సున్నిత హృదయం సమాజం చేత బాగా గాయపడినట్టుంది. ఏడ్చి బతిమాలి మహేష్‌ను ఇంటికి తీసుకువచ్చాడు మైసయ్య. పెళ్లి చేస్తే యింటి పట్టున ఉంటాడని రెన్నెల్లలోనే పెళ్లి చేశాడు. మైసయ్య అంచనా కరెక్టే అయింది. కానీ మహాసాత్వికుడూ, సున్నిత హృదయుడూ అయిన మహేష్ బాగా నెగెటివ్ థింకింగ్‌లో పడిపోయాడు. అతడికి జరిగిన అన్యాయం సరిదిద్దే దాకా ఆ నెగిటివ్‌థింకింగ్ పోదు. ప్రతిదాన్ని విమర్శించడం ఊరందరికీ మింగుడు పడడంలేదు. ముంబాయి పోయాక మారిపోయాడనుకున్నారు. మళ్లీ ముంబాయికే పోతే పీడా పోతుందనుకున్నారు.

అనుకున్నట్టుగానే ఆసరాతో రాజేశ్వర్రావు ఆంజనేయులు, సుగుణాకర్‌ల పిల్లలు స్టేట్స్‌లో యింజనీర్‌లుగా పనిలో కుదురుకున్నారు.

మైసయ్య కొడుకులు, కోడండ్లు కొట్లాడుకున్నారు. మైసయ్య వేరు పోశాడు. తనకొచ్చిన జాగ తన యిష్టం అని మహేష్ వేపచెట్టును కొట్టేశాడు. అక్కడ రేకుల షెడ్డు వేసుకున్నాడు. మహేష్‌కు యిద్దరు పిల్లలయ్యారు. ఇప్పుడతని ఆశల చెట్టు సమూలంగా నరికివేయబడింది. జీవితం యిక ఇంతే. యింతకన్నా యిక ఎదగదు అని అర్థమయ్యాక నిరాశ ఆవరించి అందర్ని విమర్శించే అతని నోరు క్రమంగా మూతబడిపోయింది. ఇప్పుడతను ప్రపంచం మునిగినా, తేలినా నిర్లిప్తంగా మన్నుతిన్న మనిషిలా మహాజాడ్యంగా చూస్తాడు.

అతన్ని చూసినప్పుడల్లా ఆంజనేయులు, సుగుణాకర్‌ల గుండెలు బాధతో కలుక్కుమంటాయి. తమ ప్రియ శిష్యుడు యిలా ఎందుకైపోయాడా అని అపుడపుడు వారిని బాధ తొలుస్తూ ఉంటుంది.

ఇపుడు ఆంజనేయులు కొడుకు స్టేట్స్ నుంచి పంపిన డబ్బుతో మంచి యిల్లు కడుతున్నాడు. దానికి మేస్త్రి మహేష్, అతని భార్య కూడా తోడు పని చేస్తుంది. మునుపు రాజేశ్వర్రావు యిల్లుకు తండ్రి పని చేస్తే ఇపుడు ఆంజనేయులు ఇల్లుకు కొడుకు పని చేస్తున్నాడు.

మహేష్ ఇప్పుడు ఉలకడు - పలకడు. ఏదైనా పని చెప్తే ఊ అంటాడు. చెప్పిన పని మాత్రం చేసుకుంటూ పోతాడు.

రాజేశ్వర్రావు పేరిట స్కూల్లో విద్యార్థులకు ఏటా ప్రతిభా పురస్కారాలు అందుతూనే ఉన్నాయి.

చాలా ఏళ్ల తర్వాత రాజేశ్వర్రావు మళ్లీ స్టేట్స్ నుంచి వచ్చాడు. ప్రభుత్వ పెట్టుబడులు ఉపసంహరిస్తూ ప్రైవేటీకరించడం, నాన్‌రెసిడెంట్ యిండియన్స్‌కు ప్రత్యేక ఆహ్వానం వగైరాలు రాజేశ్వర్రావును ఆలోచనలో పడేశాయి. ఇప్పటి స్థితిగతులపై బంధుమిత్రులతో చర్చలు చేశాడు. సన్నిహితులను హైద్రాబాద్ పిలిచి ఫైవ్‌స్టార్ హోటల్లో విందు యిచ్చాడు. ఆంజనేయులు, సుగుణాకర్‌లు కూడా వెళ్లాడు. వాళ్ల సలహా తీసుకున్నాడు రాజేశ్వర్రావు.

"ప్రభుత్వం చెప్పే మీది మాటలు నమ్మి ఈ దేశం రాకండిసార్! అలసత్వం, నిర్లక్ష్యం, రాజకీయ జోక్యం, కులాంతరాలు ఈ దేశంలో ఎవరినీ వదలకుండా చెదలులా తినేస్తున్నాయి. ఈ దేశంలో మేలిమి బంగారం కూడా మట్టిగా మార్చబడుతుంది. డాక్టర్ సాబ్. అయితే పాలకవర్గమే మీ వాళ్లు కాబట్టి మిమ్మల్ని ఈ సమస్యలు అంత బాధించకపోవచ్చు" అన్నారు ఆంజనేయులు, సుగుణాకర్‌లు ఆచితూచి.


మళ్లీ తమ పల్లెటూరు చూడాలని రెండు రోజులు ఈ సారి తప్పకుండా ఉండాలనుకుని వెళ్లాడు రాజేశ్వర్రావు.

దూరం నుంచి చూసి ముందుకు నడిచి "మైసయ్యా! మహేష్ బావున్నాడా!" అంటూ ఆనందంతో బిగ్గరగా కౌగిలించుకున్నాడు రాజేశ్వర్రావు.

"నేనే మహేష్‌ను సార్. నాన్న చనిపోయి ఏడాదైంది" అన్నాడు మహేష్, మహేష్ కళ్లలో నీళ్లు.

"మహేష్! నువ్వా! నువ్వు యింజనీర్‌వి కాలేదా! ఇంత ముసలివాడిలా అయిపోయావేంది! అసలేం జరిగింది" అంటూ ఆశ్చర్యపోయాడు రాజేశ్వర్రావు. వూళ్లో తమ నాన్న సాగించిన దౌర్జన్యాలకు భిన్నంగా వుండాలని, తమ పాలేరు కొడుకు యింజనీర్ అయ్యాడని తాను సగర్వంగా చెప్పుకుందామనుకున్న రాజేశ్వర్రావు కళ్లలో తడి.

"సార్! మీరేదో హైటెక్ సిటీ దగ్గర ఏదో ఫ్యాక్టరీ కడుతున్నారట! నన్ను మేస్త్రి పనికి తీసుకోన్రి. తర్వాత వాచ్‌మన్ పని ఇచ్చినా సరే. నా పిల్లల్నయినా పట్నంలో మంచి స్కూల్లో చదివించడానికి నాకీ సాయం చెయ్యండి సార్" అంటూ దండం పెట్టాడు



మహేష్.

"ఇంజనీర్‌గా పెట్టుకుందామనుకున్న మహేష్ - వాచ్‌మన్ పని అడగడంతో రాజేశ్వర్రావు కళ్లలోంచి నీళ్లు జలజల రాలాయి. ప్రభుత్వం, సమాజం ఉన్నంతలో ఇంత చేసినా అణగారిన వర్గాలకు, కులాలకు అభివృద్ధి ఫలాలు ఎందుకందడం లేదో అర్థం కాలేదు.

మనసు వికలమై రెండు రోజులుందామనుకున్న రాజేశ్వర్రావు ఎందుకో అదే రోజు హైద్రాబాద్ ప్రయాణమయ్యాడు.

**ఆదివారం ఆంధ్రజ్యోతి, 20 ఆగస్టు 2000**